క్లుప్తంగా

ఇన్విటేషన్ టోర్నమెంట్లకు సన్నాహాలు

ఒంగోలు రూరల్: మండలంలోని కరవది జిల్లా పరిషత్ హైస్కూలు పూర్వ హెచ్ఎం దివంగత హనుమంతరావు మెమోరియల్ స్టేట్ లెవల్ వాలీబాల్, కబడ్డీ ఇన్విటేషన్ టోర్నమెంట్లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంపై ప్రణాళికలు సిద్ధం చేసేందుకు హనుమంతరావు వద్ద విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని వచ్చే శనివారం ఉదయం 10 గంటలకు కరవదిలోని జెడ్పీ హైస్కూల్లో సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వెనుకబడిన జిల్లాగా గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొండారెడ్డి

కొత్తపట్నం: ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా ప్రకటించి రూ.10 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీని రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జీవీ కొండారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం సీపీఎం మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. సీపీఎం సీనియర్ నాయకుడు పట్టపు ప్రకాశం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా ఏర్పడి 54 ఏళ్లు అయినా అభివృద్ధిలో వెనుబడిపోయిందన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక, విద్య, వైద్యం, మౌలిక రంగాల్లో ప్రకాశం జిల్లా తీవ్రంగా వెనుకబడి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టులు పూర్తయినప్పటికీ సాగునీరు, తాగునీరు లేక జిల్లా ప్రజలు అల్లాడిపోతున్నారని పేర్కొన్నారు. బడ్జెట్ రూపకల్పన జరుగుతున్న నేపథ్యంలో పాలకులు ప్రకాశం జిల్లా అభివృద్ధికి ఇచ్చిన హామీల అమలుకు నిధులు రాబట్టాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సూరిని స్వామిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

వేగంగా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్



రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్న సిబ్బంది

ఒంగోలు రూరల్: మండలంలోని కరవది గ్రామ సచివాలయంలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం సాయంత్రం 8 గంటల వరకు వీఆర్‌వోలు శ్రీనివాసమూర్తి, జగదీష్‌బాబు ఆధ్వర్యంలో డిజిటల్ అసిస్టెంట్లు వెంకటాద్రి, శ్రీనివాస్ ఈ ప్రక్రియ నిర్వహించారు. కార్యదర్శి శ్రీనివాస్, వేమా శ్రీలక్ష్మి పర్యవేక్షణలో రిజిస్ట్రేషన్లు పూర్తయ్యేందుకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు తగిన ఆదేశాలు జారీ చేశారు. డిజిటలైజేషన్, రిజిస్ట్రేషన్ వేగంగా జరుగుతుందని కార్యదర్శులు, వీఆర్‌వోలు తెలిపారు.

కరాటే పోటీల్లో చిన్నారుల ప్రతిభ

వేటపాలెం: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో వేటపాలెం లిటిల్ స్కాలర్ స్కూల్ విద్యార్థులు బంగారు పతకా లు సాధించారు. ఆదివారం గుంటూరు, బాపట్ల జిల్లా ల్లో మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వారి ఆధ్వర్యంలో కరాటే పోటీలు నిర్వహించారు. పోటీల్లో లిటిల్ స్కాలర్ స్కూల్ విద్యార్థులు బాలురుల కటాస్ విభాగంలో జాన్ రోనాల్డ్, బి వెంకట సాయి చరణ్, జీ సాద్విక్ ముగ్గురు బంగారు పతకాలు సాధించగా, కుమితే విభాగంలో అజయ్ శ్రీరాం, చరణ్ వెండి పతకాలు సాధించారు. టీం కటాలో కే హేమంత్ సాయి, ఎం షాన్ ప్రకాష్, ఎస్ చైతన్య బంగారు పతకాలు సాధించగా అదే విభాగంలో పి సుజిత్, వెంకటసాయి, ఎస్ పార్థసారథి, కే కార్తికేయ, వి హితేష్ కాంస్య పతకాలు సాధించారు. ఎస్ వరుణ్‌సాయి వెండి పతకం సాధించాడు. బాలికల విభాగంలో వీ పరిణితి కాంస్య పథకం సాధించింది. విద్యార్థులను కోచ్ మాస్టర్ వి బ్రహ్మనాయుడు, స్కూల్ డైరెక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు అభినందించారు.

మహిళలను ఆర్థికంగా నిలబెట్టిన సీఎం జగన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున



మహిళలకు చెక్కులు అందజేస్తున్న మంత్రి మేరుగు, ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి

- వైఎస్సార్ ఆసరా 4వ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మేరుగు నాగార్జున

నాగులుప్పలపాడు: డ్వాక్రా సంఘాల ద్వారా మహిళల్లో ఆర్థిక స్థిరత్వం పెంపొందించిన ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున అన్నారు. వైఎస్సార్ ఆసరా 4వ విడత నగదు చెల్లింపు మండల స్థాయి కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం నాగులుప్పలపాడులోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. మహిళలతో కలిసి మంత్రి మేరుగు నాగార్జున ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి నాగార్జున మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో డ్వాక్రా సంఘాల అక్కచెల్లెమ్మలను నిలువునా ముంచారని గుర్తు చేశారు. వారిపై మరింత ఆర్థికభారాన్ని చంద్రబాబు మోపారని తెలిపారు. వారి కష్టాన్ని చూసిన జగనన్న ఆనాడు పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటి వరకు గత ప్రభుత్వం హయాంలో ఉన్న అప్పులు మొత్తాన్ని చెల్లించారని తెలిపారు. మహిళా తల్లులకు అండగా నిలుస్తూ వారి ఆర్థిక సంక్షేమానికి కృషి చేస్తున్న జగనన్నను వచ్చే ఎన్నికల్లో అందరూ తప్పకుండా ఆశీర్వదించాలన్నారు. నియోజకవర్గంలో ఎవరికి ఎటువంటి కష్టం వచ్చినా పెద్ద కొడుకులా ఆదుకుంటానని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాగిస్తున్న సంక్షేమ పాలన, మహిళలకు చేసిన మేలును ప్రతిఒక్కరూ గుర్తు పెట్టుకోవాలని కోరారు. మహిళాభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన జగనన్న ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గుర్తు పెట్టుకుని సంతనూతలపాడు నియోజకవర్గంలో మళ్లీ వైఎస్సార్ సీపీ జెండా ఎగురువేయాలని కోరారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. అనంతరం నాగులుప్పలపాడు మండల వ్యాప్తంగా ఉన్న 1,544 డ్వాక్రా సంఘాలలో గల 15,072 మంది సభ్యులకు 13 కోట్ల 36 లక్షల రూపాయల ఆసరా చెక్కులను అందజేశారు. ముందుగా మంత్రి మేరుగు నాగార్జునకు ఎంపీపీ దంపతులు నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి పూలబొకేతో సాదరంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, లిడ్ క్యాప్, శాలివాహన, హౌసింగ్ కార్పొరేషన్ల డైరెక్టర్లు కంచర్ల సుధాకర్, పేరాల చెన్నకేశవులు, కొలకలూరి విజయ్‌కుమార్, నాయకుడు పులిచర్ల పరంధామిరెడ్డి, ఏపీఎం హనుమంతరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీప్రతిభ, శ్రీగురుదత్త విద్యాసంస్థల వార్షికోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న నల్లూరి వెంకటేశ్వర్లు

ఒంగోలు: స్థానిక పేర్నమిట్టలోని శ్రీప్రతిభ, శ్రీగురుదత్త విద్యాసంస్థల వార్షికోత్సవం ఆదివారం పేర్నమిట్టలోని క్యాంపస్‌లో ఘనంగా జరిగింది. 42వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అతిథుల మధ్య విద్యాసంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు కేక్ కట్ చేసి సంబరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రుల ఆలోచనలకు అనుగుణంగా విద్యాబోధన నిర్వహిస్తున్నామన్నారు. అందువల్లే ఇంటర్, పదో తరగతిలో రాష్ట్రస్థాయిలో మార్కులు, ర్యాంకులు తమ విద్యార్థుల వశమవుతున్నాయన్నారు. ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా విద్యాబోధన కొనసాగిస్తూ విద్యార్థులను ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తక్కువ ఫీజుతో కార్పొరేట్ స్థాయికి మించిన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉత్తమ ర్యాంకులు సాధించడం ద్వారా తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. క్విస్ విద్యా సంస్థల అధినేత నిడమానూరి కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ శ్రీప్రతిభ విద్యాసంస్థలకు 42వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్యా సంస్థ అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు కృషికి నిదర్శనమే వేలాదిమంది విద్యార్థులు విద్యార్జన చేయడమని అన్నారు. ఇంటర్ బోర్డు ఆర్‌జేడీ వీవీ సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యార్జన చేస్తే విజయాలు, ర్యాంకులు పాదాక్రాంతం అవుతాయన్నారు. ఈ సందర్భంగా 2022–23 విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు, ఎంసెట్, జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ప్రకాశం బాలోత్సవాన్ని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న బాలోత్సవం ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం

ఒంగోలు: స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించే బాలోత్సవాన్ని జయప్రదం చేయాలని బాలోత్సవ ప్రధాన కార్యదర్శి కల్లా సుబ్రహ్మణ్యం విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన బాలోత్సవ వర్క్‌షాపులో పాల్గొని అకడమిక్ కమిటీలు, కల్చరల్ కమిటీలకు సంబంధించిన విధివిధానాలు, ఏర్పాట్ల గురించి చర్చించారు. పాఠశాలలకు పంపిన రిజిస్ట్రేషన్ పత్రాలు సోమవారం సాయంత్రం 5 గంటలలోపు 9490300412 నంబర్‌కు వాట్సాప్ ద్వారా అందేలా చర్యలు చేపట్టాలన్నారు. అమరావతి బాలోత్సవం కార్యదర్శి రామరాజు మాట్లాడుతూ విద్యార్థులలో బహుముఖమైన ప్రతిభాపాటవాలను వెలికితీసేందుకు ఈ బాలోత్సవాన్ని తొలిసారిగా ఒంగోలులో నిర్వహిస్తున్నామన్నారు. విద్యాశాఖ సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోటరీక్లబ్ నాయకుడు బండారు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బాలోత్సవంలో వివిధ రకాలైన సంస్థలు, సంఘాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వర్క్‌షాపులో యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు డి.వీరాంజనేయులు, ఎస్‌కే అబ్దుల్, జి.ఉమామహేశ్వరి, వి.బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నగారి చెరువుకు మహర్దశ



అక్కన్నగారి చెరువు



చెరువు అభివృద్ధి పనులు చేస్తున్న జేసీబీ

- ఎమ్మెల్యే బాలినేని చొరవతో అభివృద్ధి పనులకు శ్రీకారం

ఒంగోలు రూరల్: మండలంలోని కరవది తూర్పుహరిజనవాడ వద్ద గల అక్కన్నగారి చెరువుకు మహర్దశ పట్టింది. ఎన్నో దశాబ్దాలుగా ఈ చెరువు నిరుపయోగంగా ఉంది. భారీ వర్షాలు కురిసి వరదలు వచ్చినప్పటికీ నీటి నిల్వ సామర్థ్యం లేక వృథాగా ఉంది. ప్రస్తుతం స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చొరవతో చెరువు అభివృద్ధికి అడుగు పడింది. తద్వారా గ్రామస్తుల నీటి కొరత తీరనుంది. అక్కన్నగారి చెరువుకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. 14 ఎకరాల విస్తీర్ణం గల ఈ చెరువుకు చేరుకోవడానికి ఏ మార్గం లేకపోవడంతో.. ఆ చెరువుకు వెళ్లేందుకు కాలనీ నుంచి 20 సెంట్ల భూమిని తన సొంత సొమ్ము వెచ్చించి బాలినేని కొనుగోలు చేశారు. దీంతో చెరువుకు వెళ్లేందుకు దశాబ్దాల తర్వాత రోడ్డు ఏర్పడింది. వరదలు, భారీ వర్షాలకు సమీప పొలాల నుంచి మట్టి మేట వేసి చెరువు రూపం కోల్పోయింది. దీనిపై స్పందించిన బాలినేని.. చెరువులో పూర్తి స్థాయిలో పూడిక తీసేందుకు, కట్టలు పటిష్టం చేసి ఫెన్సింగ్ వేసి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు జెడ్పీ నిధుల నుంచి రూ.60 లక్షలు విడుదల చేయించారు. వాటితో చెరువు పూడికతీత పనులు వేగంగా జరిగాయి. ప్రస్తుతం చెరువు ఆనకట్టలు పటిష్టం చేస్తున్నారు. చెరువులో తీసిన పూడికతీత మట్టితోనే 14 ఎకరాల చెరువు చుట్టూ కట్టలు నిర్మించారు. ఒకసారి చెరువు నింపితే కనీసం మూడేళ్ల పాటు తూర్పుహరిజనవాడ గ్రామస్తుల దాహార్తి తీరి వాడుక నీటికి కూడా సరిపోయేలా చెరువు లోతు పెంచారు. మూడు జేసీబీలు, ఒక రోలింగ్ మిషన్, 10 ట్రాక్టర్లు ప్రస్తుతం ఈ పనులు చేస్తున్నాయి. వాకింగ్ ట్రాక్‌తో పాటు చెరువు చుట్టూ పూల మొక్కలు, నీడ నిచ్చే మొక్కలు నాటేందుకు విశాలమైన ట్రాక్ నిర్మిస్తున్నారు. ఇదే సమయంలో చెరువు కట్ట కొంత భాగంలో చిన్నారులు ఆడుకునేందుకు పార్కు ఏర్పాటు చేస్తామని, భద్రత కోసం ఇనుప కంచె నిర్మిస్తామని తెలిపారు. ప్రస్తుతం పనులు తుది దశలో ఉన్నాయి. త్వరలో తమ దాహార్తి తీర్చేందుకు కృషి చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

ఒంగోలు సబర్బన్: మైనర్ బాలిక పెళ్లిని అధికారులు అడ్డుకున్న ఘటన కనిగిరిలో జరిగింది. కనిగిరి పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన 14 ఏళ్ల బాలిక 9వ తరగతి చదువుతోంది. అదే కాలనీకి చెందిన ఒక బాలుడితో ఆ బాలికకు వివాహం చేసేందుకు కొంతకాలంగా ఆమె తల్లి ప్రయత్నిస్తోంది. వివాహానికి అంగీకరించక పోవడంతో కూతురిని కొట్టడం, తిట్టడం లాంటి వేధింపులకు పాల్పడుతోంది. దీంతో సదరు బాలిక ఆదివారం కనిగిరికి చెందిన స్నేహహస్తం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు డి.సుధీర్‌బాబు దృష్టికి తీసుకెళ్లింది. వెంటనే స్పందించిన ఆయన.. ఆ విషయంపై ఒంగోలు హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్ ద్వారా ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి, కనిగిరి డీఎస్పీ రామరాజుకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశాలతో సీడీపీవో బి.సరోజిని, ఎంపీఎస్ పార్వతి రంగంలోకి దిగి బాలికను ఒంగోలు లోని బాలసదన్‌కు తరలించారు. బాలిక తల్లిదండ్రులను పోలీసుస్టేషన్‌కు పిలిపించి బాల్యవివాహం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్లమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమపూజలు, అఖండహారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

శ్రీగిరి గోశాల నిర్వహణ తీరు అభినందనీయం



శ్రీగిరి గోశాలను సందర్శిస్తున్న ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు

- విశ్రాంత ఐఏఎస్ అధికారి చక్రపాణి

ఒంగోలు మెట్రో: మరో దివ్య తిరుమలగా పేరొందిన ఒంగోలు కొండమీద గల శ్రీగిరి వేంకటేశ్వర స్వామి ఆలయానికి అనుసంధానంగా ఉన్న శ్రీగిరి గోశాలను విశ్రాంత ఐఏఎస్ అధికారి, సీజీడీటీ ఐబీటీ హైదరాబాద్ డైరెక్టర్, ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల చైర్మన్ చక్రపాణి ఆదివారం సందర్శించారు. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి సందర్శించి శ్రీగిరి గోశాల నిర్వహణతో పాటు గోవుల ఆరోగ్య సంరక్షణకు శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి తీసుకుంటున్న చర్యలను చక్రపాణి అభినందించారు. అనంతరం చక్రపాణి శ్రీగిరి వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు చక్రపాణికి వేదఆశీర్వచనంతో శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, అర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి, ఆలూరు జై శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భోగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పెద్దారవీడులో శివలింగంకు అభిషేకాలు చేస్తున్న శివస్వాములు, అర్చకులు

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడులో దుర్గా సమేత భోగేశ్వరస్వామి మూడో వార్షికోత్సవం సందర్భంగా శివాలయంలో అర్చకులు మేడవరం రాఘవేంద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు ఆదివారం నిర్వహించారు. స్వామి వారికి ఉదయం గణపతి పూజ, అభిషేకం, చండీ హోమం, తదితర పూజలు చేసిన అనంతరం శివ లింగంకు పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం శివస్వాములు మెట్లపూజ, భజన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించి కాయకర్పూం సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నిస్వార్థ సంగీత సేవకులు 'పోరూరి'

చీరాల అర్బన్: అంకితభావంతో నిస్వార్థంగా సంగీత సేవ చేసిన నిగర్వి పోరూరి లక్ష్మీనరసింహారావు అని పలువురు వక్తలు కొనియాడారు. చైతన్య భారతి ఆధ్వర్యంలో సంగీత సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. చైతన్యభారతి, శ్రీవాణి కళానికేతనం సంయుక్త ఆధ్వర్యంలో పోరూరి లక్ష్మీనరసింహారావు 23వ సంస్మరణోత్సవాన్ని ఎన్‌వీఎస్ఎస్‌జెఆర్ కళ్యాణ మండపంలో ఊటుకూరి వెంకటరావు అధ్యక్షతన ఆదివారం రాత్రి నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ పోరూరి లక్ష్మీనరసింహారావు ఎప్పుడూ వ్యాపారాత్మక దృష్టితో ఆలోచించకుండా చీరాల, పరిసర ప్రాంత సాంస్కృతిక సేవా సంస్థలకు వెన్నుముకగా నిలిచారన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన స్వర్ణ ప్రయాగరావు మాట్లాడుతూ సంగీత బోధన చేసే సమయంలో ఎక్కడా రాజీ పడేవారు కాదని, ఆంధ్రదేశంలో మొదటి పది మంది ఉత్తమ సంగీత విద్వాంసులలో పోరూరి ఒకరని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాలపర్తి ఆంజనేయశాస్త్రి, చైతన్య భారతి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సూర్యదేవర ఉమామోహన్, భాగి నారాయణశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటాం



బూచేపల్లి వెంకాయమ్మ,శివప్రసాదరెడ్డిని సన్మానిస్తున్న మహిళలు



ఆర్యవైశ్య మహిళలతో ముచ్చటిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

దర్శి: ఆర్యవైశ్యులందరికీ అండగా ఉంటూ వారి వ్యాపారాల అభివృద్ధికి తోడ్పడతానని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జిడాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. పొదిలి రోడ్డులోని పానుగంటి వారి నివాసం వద్ద బూచేపల్లి కుటుంబ సభ్యులతో ఆత్మీ సమ్మేళనాన్ని పానుగంటిరజనీ కోటీశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ దర్శి నియోజకవర్గంలో 20 సంవత్సరాలుగా తమ తండ్రి బూచేపల్లి సుబ్బారెడ్డిని ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలిపించారని, ఆతరువాత బూచేపల్లి శివప్రసాదరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి తమ కుటుంబానికి అండగా ఉన్నారన్నారు. ఈ ఎన్నికల్లో కూడా శివప్రసాదరెడ్డి పోటీచేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి అవకాశం కల్పించారని చెప్పారు. ఆర్యవైశ్యులందరూ మంచి మనసుతో ఓట్లేసి అత్యధిక మెజార్టీతో బూచేపల్లి శివప్రసాదరెడ్డి గెలిపించాలని కోరారు. ఆర్యవైశ్యులకు ఎటువంటి అవసరాలున్నా నేరుగా తమను కలిసి తమ అవసరాలు తీర్చుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు దేవతి గుప్తా, చీదెళ్ల బసవయ్య, పరుచూరి సుబ్బయ్య, రాఘవ, కొత్త చెంచురామారావు, దేవతి సురేష్, మునగా అరుణ్ కుమార్, సూరే పూర్ణ, దేవతి రాజేష్, సముద్రాల రామకృష్ణ, దేవతి రవికుమార్, సముద్రాల నాగేశ్వరరావు, సముద్రాల గురవారావు, మునగా శ్రీనివాసరావు, దేసు జాలేశ్వరరావు, కొత్త వెంకట అయ్యపుశెట్టి, పెండ్యాల సాంబశివరావు, దేవతి ప్రమీల, రజని, దేవతిరాధ, కొల్లా శివ, సముద్రాల లక్ష్మి, దేసు సంధ్య, కోటా రమణ, పరుచూరి ప్రభ, ఇందిర, నాగలక్ష్మి, అన్నా కుమారి, దర్శి మాధవి, కప్పల అరుణ, వరలక్ష్మి, భారతి, అరుణ, పత్తి, రాజేశ్వరి, సత్యవతి, మారం భగవద్గీత పాల్గొన్నారు.

క్రికెట్ జట్టుకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: మంచి నైపుణ్యంతో క్రీడల్లో రాణించడం అభినందనీయమని నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక బూచేపల్లి నివాసంలో ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో ప్రథమ స్థానం పొందిన తాళ్లూరు మండలం నాగంబొట్లపాలెం టీంను ఆదివారం అభినందించారు. వారికి రూ.25వేలు ఆర్థిక సాయం అందించారు. శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో రాణించి జిల్లాకు దర్శి నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సర్పంచ్ సుబ్బారావు, దిశ కమిటీ మెంబర్ అనీల్ రెడ్డి పాల్గొన్నారు.

తాళ్లూరు (ముండ్లమూరు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం.. ఆంధ్ర ఆటల పోటీల్లో భాగంగా జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో మొదటి సాధించి రాష్ట్ర స్థాయిలో ఆడేందుకు ఎంపికైన మండలంలోని నాగంబొట్లపాలెం క్రికెట్ జట్టుకు క్రీడాకారులను ఆదివారం అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో క్రికెట్ క్రీడాకారులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించి వారిలోని నైపుణ్యతను వెలికితీసేందుకు ప్రభుత్వం ఆడుదాం.. ఆంధ్ర ఆటల పోటీలు ఏర్పాటు చేసిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి క్రీడలపై ఉన్న మక్కువతో యువతకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఇప్పటికే నియోజకవర్గ స్థాయిలో రూ. 35 వేలు, జిల్లా స్థాయిలో 60 వేలు ప్రోత్సాహక నగదును నాగంబొట్లపాలెం జట్టు సాధించిందన్నారు. రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో ఇదే ఉత్సాహంతో ప్రతిభ కనబరిచి గెలుపు సాధించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. జిల్లా స్థాయిలో విజయం సాధించినందుకు గాను ఎంపీడీఓ కె. యుగకీర్తి క్రికెట్ టీం సభ్యులను ప్రోత్సహిస్తూ ఐదు వేల నగదును అందజేశారు. అనంతరం క్రికెట్ జట్టు కెప్టెన్ వేడికొల ఆశోక్‌రెడ్డితో పాటు క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు ఎడమకంటి వెంకటేశ్వరరెడ్డి, మంచాల ప్రియాంక నాగార్జునరెడ్డి, నాగంబొట్లపాలెం సర్పంచ్ చిమటా సుబ్బారావు, ఎంపీటీసీ వీరయ్య, పంచాయతీ కార్యదర్శి నరేంద్ర, క్రీడాకారులు కొనికి రామాంజి, చిరంజీవి, సుధాకరరెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ట్రోఫీతో ఎస్ఎస్ అగ్రి కాలేజీ విద్యార్థినులు



క్రికెట్ జట్టును అభినందిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆడుదాం ఆంధ్రాలో ఎస్ఎస్ విద్యార్థుల ప్రతిభ

మార్కాపురం: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా ఒంగోలులో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో స్థానిక ఎస్ఎస్ అగ్రికల్చర్, హార్టికల్చర్ కళాశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచినట్లు చైర్మన్ నాదెళ్ల చంద్రమౌళి, ఫౌండర్ నాదెళ్ల సుబ్రహ్మణ్యం డీన్ డాక్టర్ ఆర్‌వీఎస్‌కే రెడ్డి తెలిపారు. విద్యార్థినులు యోగిత, గోపిక, చందన, పూజిత రెడ్డి, మాధురీ, స్వప్న, లక్ష్మీ ప్రసన్న, పూజిత, జాహ్నవిని అభినందించారు.